క్లుప్తంగా

స్వచ్ఛతపై విస్తృత ప్రచారం



పటమట(విజయవాడతూర్పు): ఇండియా స్వచ్ఛత లీగ్ 2.0లో భాగంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం వంటి పలు అంశాలు నగర వాసులకు వివరించేందుకు వీఎంసీ మొబైల్ వ్యాన్లతో స్క్రీన్లతో విస్తృత ప్రచారం ప్రారంభించింది. ప్రచార వాహనాలను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ప్రధాన కార్యాలయంలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

3 నుంచి స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కోర్సుల్లో అక్టోబర్ 3వ తేదీ నుంచి వివిధ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. కట్టింగ్ అండ్ టైలరింగ్, డ్రెస్ మేకింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, జ్యూట్ క్రాఫ్ట్స్ మేకింగ్ అసిస్టెంట్, బ్యూటీ కేర్ అసిస్టెంట్, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్, స్క్రీన్ ప్రింటింగ్, బాతిక్ ప్రింటింగ్, ఫ్రూట్స్ అండ్ వెజిటేబుల్ ప్రాసెసింగ్ అండ్ ప్రిజర్వేషన్ అసిస్టెంట్, జామ్ అండ్ జ్యూస్ మేకింగ్, అసిస్టెంట్ డ్రెస్ మేకర్, అసిస్టెంట్ హ్యాండ్ ఎంబ్రాయిడరీ, ఫ్యాషన్ జ్యూయలరీ మేకింగ్, మిర్రర్ వర్క్ తదితర అంశాల్లో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. 0866-2470420 నంబరులో సంప్రదించాలని కోరారు.

4న నీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): భవానీపురం హెడ్‌వాటర్ వర్క్స్‌లోని 5 ఎంజీడీ(పాతది) క్లియర్ వాటర్ సంపును శుభ్రం చేస్తున్నందున ప్లాంట్‌ను బ్రేక్‌డౌన్ చేస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో అక్టోబర్ 4వ తేదీన నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. శ్రీనివాసమహల్, ఫిష్ మార్కెట్, గాంధీ బావి-1, గాంధీ బావి-2, అంబేడ్కర్ కాలనీ, ఓఆర్ఆర్ఆర్ఎస్ ప్రాంతం, గాంధీ హైస్కూల్, రథం సెంటర్, పూలబావి, శివాలయం, కొట్టేటి కోటయ్య, నైజాం గేటు ప్రాంతాలకు నీటి సరఫరాను 4వ తేదీ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ముందస్తుగా నీటి నిల్వలు ఉంచుకుని నగరపాలక సంస్థ అధికారులకు సహకరించాలని కోరారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పనికి వెళ్లిన తన భర్త అదృశ్యమైనట్లు అతని భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన కోలా పార్వతి, నాగరాజు భార్యభర్తలు. వీరికి పదేళ్ల కిందట వివాహం కాగా, ఇద్దరు ఆడపిల్లలు సంతానం. నాగరాజు తాపీ పనులు చేస్తుంటాడు. ఇతర ప్రాంతాలకు పనికి వెళ్లే నాగరాజు రెండు, మూడు నెలలకు ఒకసారి భార్య, పిల్లలను చూసుకునేందుకు వస్తుంటాడు. జూలై 21న పనికి వెళ్లిన నాగరాజు మూడు నెలలు అయినా తిరిగి ఇంటికి రాలేదు. పలుమార్లు నాగరాజు ఫోన్‌కు పార్వతి కాల్ చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆందోళన చెందిన పార్వతి తన భర్త కనిపించడం లేదంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోడ్రైవర్‌పై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మితిమీరిన వేగంతో బస్సు ఎందుకు నడిపావని అడిగినందుకు ఆటోడ్రైవర్‌పై దాడికి పాల్పడిన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన షేక్.ఐజాక్ వలీ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. శనివారం ఉదయం సితారా వైపు నుంచి కాలనీకి వెళ్తుండగా, కాలనీ నుంచి ఫ్లై ఓవర్ వైపు కాలేజీ బస్సు వేగంగా వచ్చింది. దీనిపై బస్సు డ్రైవర్‌ను ఐజాక్ వలీ ఎందుకు అంత స్పీడని అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో బస్సు డ్రైవర్ పరిమి నరేష్ రాడ్‌తో ఐజాక్ వలీపై దాడి చేశాడు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

గుణదల(విజయవాడతూర్పు): క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని లయన్ హరిబాబు అన్నారు. గురునానక్ నగర్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి కమ్యూనిటీ హాల్‌లో శనివారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు జరిగింది. వీఆర్‌కే నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరిబాబు మాట్లాడుతూ.. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. జంక్ ఫుడ్‌తో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు సురేంద్ర బాబు, లక్ష్మి, దుర్గాభవాని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సెల్ ప్లాంట్‌లో ఇన్ఫర్మేషన్ పార్క్ పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అజిత్ సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌లో నిర్మాణంలో ఉన్న ఇన్ఫర్మేషన్ పార్క్‌ను శనివారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్లాంట్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆడిటోరియంను పరిశీలించి ఆడిటోరియంలోకి వెళ్లేది, వచ్చేది ఒకే ద్వారం ఉండటం ఇబ్బందిగా ఉంటుందని, మరో ద్వారాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పార్క్‌లో ఏర్పాటు చేసే గ్రీనరీని ఎప్పుడు వాడే గ్రీనరీ కాకుండా హెర్బల్, జోడైక్ గార్డెన్ సంబంధించిన గ్రీనరీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే గాజిబో ద్వారా ఏర్పాటు చేస్తున్న హట్‌ను మాములు బ్రిక్స్‌తో కాకుండా ప్లాస్టిక్ పెట్ బాటిల్స్‌తో బ్రిక్స్ నిర్మించాలని అధికారులకు ఆదేశించారు. పార్క్‌లో హోమ్ కంపోస్టింగ్ విధానాన్ని ప్రత్యక్షంగా చూడడానికి, చూసి నేర్చుకునే విధంగా ఉండేటట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ ఇన్ఫర్మేషన్ పార్క్ పారిశుద్ధ్య కార్మికులకు అంకితం చేసే విధంగా కృషి చేస్తున్నామని కమిషనర్ అన్నారు. ఇన్ఫర్మేషన్ పార్క్ ముఖ్య ఉద్దేశం ఎక్సెల్ ప్లాంట్‌లో ఫ్లవర్ వేస్ట్ మేనేజ్‌మెంట్, విండో కంపోస్టింగ్, వర్మి కంపోస్ట్ ప్లాంట్, బయో మిథనేషన్ ప్లాంట్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మ్యానేజ్మెంట్ ప్లాంట్లు, మినీ సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, ట్రీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ స్క్రాప్, స్క్రాప్ ష్లేసింగ్ యూనిట్, మాట్రెస్స్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, సి-డి వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్‌ల గురించి త్రి డీ పద్ధతిలో ప్రత్యక్షంగా విద్యార్థులకు, పిల్లలకు, ప్రజలందరికీ సమాచారాన్ని చూపించడానికి ఏర్పాటు చేయబడుతుందని తెలిపారు. అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం



మొక్క నాటిన గోదావరి గంగ, విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మనం నివసించే ఇంటితో పాటు పరసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ అన్నారు. డివిజన్‌లో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ – 2023 కార్యక్రమంలో శనివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని పలు వీధులను స్థానికుల భాగస్వామ్యంతో శుభ్రం చేశారు. అలాగే పుచ్చలపల్లి లీలావతి మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధిస్తామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సైడు కాలువలు, ఓపెన్ డ్రెయిన్లలో చెత్త, వ్యర్థాలు వేసి మురుగునీటి పారుదలకు ఆటంకం కలిగించవద్దని కోరారు. లేని పక్షంలో దోమలు వృద్ధి చెంది అనారోగ్యం పాలు కావల్సి వస్తుందని చెప్పారు. ప్రభుత్వమే అన్నీ చేయాలనుకోవడం సరి కాదని, ప్రజలుకూడా తమ వంతు సహకారం అందించాలని సూచించారు. డివిజన్ బాధ్యులు గోదావరి బాబు, శానిటరీ ఇనస్పెక్టర్ హెచ్.శ్రీనివాసరావు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు పవన్‌కుమార్, మాధవరావు, ప్రభాకరరావు, దుర్గ, శానిటరీ మేస్త్రిలు పాల్గొన్నారు.

ఎన్సీసీ క్యాడెట్ సంధ్య అరుదైన ఘనత



సంధ్యను అభినందిస్తున్న విజయబాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నలంద డిగ్రీ కళాశాల ఎన్సీసీ క్యాడెట్ బుగత సంధ్య 1,250 అడుగులు ఎత్తు నుంచి పారాజంప్ చేసి అరుదైన ఘనత సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. రాష్ట్రంలో ఇద్దరు ఎన్సీసీ క్యాడెట్స్ ఎంపిక కాగా, అందులో ఒకరు విజయవాడకు చెందిన తమ కళాశాల విద్యార్థి సంధ్య అన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పారాజంప్ సెలక్షన్స్‌తో అర్హత సాధించినట్లు తెలిపారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారుల పర్యవేక్షణలో ఆగ్రాలోని పారా ట్రూపర్స్ ట్రైనింగ్ స్కూల్‌లో సెప్టెంబర్ 1 నుంచి 25 వరకూ పారాబేసిక్ కోర్సు శిక్షణ పొందారన్నారు. ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన విమానం నుంచి 1,250 అడుగుల ఎత్తు నుంచి నేలమీదకు రెండుసార్లు పారాజంప్ చేసి విజయవంతంగా బుగత సంధ్య శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు, అధ్యాపకులు సంధ్యను అభినందించారు.

10, 11 తేదీల్లో దసరా మహిళా సాంస్కృతిక ఉత్సవాలు



ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వరూపరాణి తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): దసరా పండుగను పురస్కరించుకుని ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అక్టోబర్ 10, 11 తేదీల్లో దసరా మహిళా సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కె.స్వరూపరాణి పేర్కొన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ అక్టోబర్ 10న ఉదయం 10 గంటలకు ఘంటసాల సంగీత, నృత్య కళాశాలలో బతుకమ్మ, కోలాటం, జడ కోలాటం, జానపద నృత్యాలు, క్లాసికల్ పోటీలు జరుగుతాయన్నారు. 11న ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి శాస్త్రీయ నృత్యాలు, దాండియా, లఘునాటికలు, అభ్యుదయ గీతాలు వంటి కళారూపాలతో ఉత్సవాలు జరుగుతాయన్నారు. సాంస్కృతిక ఉత్సవాల్లో నగరానికి చెందిన డ్యాన్స్ అకాడమీలు, కోలాట గురువులు, కాలేజీల యాజమాన్యాలు తమ సంపూర్ణ సహకారాన్ని అందించడానికి ముందుకు వచ్చారన్నారు. ఉత్సవాల్లో స్త్రీలు, పురుషులు, కాలేజీ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో జి.జ్యోత్స్న, వి.సత్యవతి, విద్యాఖన్నా, పి.విజయ, ఎ.సంధ్యారాణి, కె.ఉషారాణి, వి.భారతి దేవి, వి, కామేశ్వరి, వి.లేపాక్షి, కె.సరోజ పాల్గొన్నారు.

ఘనంగా బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో శనివారం బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దిన వేడుకలు ఘనంగా జరిగాయి. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఏకరూప దుస్తులు ధరించి జాతీయ జెండాలు చేతబూని బీఎస్ఎన్ఎల్ ఆకారంలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఈ ఏడాది నుంచి దేశవ్యాప్తంగా 4జీ సేవలు ప్రారంభిస్తుందన్నారు. విజయవాడ జనరల్ మేనేజర్ వై.రవీంద్రనాథ్, సర్కిల్ కార్యాలయం ఉన్నత అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎం సభ విజయవంతంతో ప్రతిపక్షాలకు షాక్



మాట్లాడుతున్న గౌస్‌మొహిద్దీన్

వించిపేట(విజయవాడపశ్చిమ): నగరంలో సీఎం వైఎస్ జగన్ సభ విజయవంతం కావడంతో తట్టుకోలేక టీడీపీ, జనసేన నేతలు విమర్శలు చేయడం వారి దిగజారుడు తనానికి పరాకాష్ట అని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ విమర్శించారు. శనివారం వించిపేట, నైజాంగేటుసెంటర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అవినీతి కేసులో జైలుపాలైన సందర్భంలో ఆ పార్టీ నేతలు ఇచ్చిన పిలుపుమేరకు ప్రజలు ఎవరు కూడా నిరసన తెలియజేయడానికి బయటకు రాలేదన్నారు. వైఎస్సార్ వాహన మిత్ర నిధుల విడుదల సభకు పోటెత్తిన జనాలను చూసి తట్టుకోలేక సీఎం సభ వెలవెలపోయిందంటూ జనసేనా, టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కొన్ని రోజులు పెయిడ్ ఆర్టిస్టులతో సందడి చేసిన టీడీపీ, జనసేన నాయకులకు సీఎం సభకు వచ్చిన స్పందన చూసి పిచ్చిప్రేలాపనలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సభలోనే నియోజకవర్గంలోని సమస్యలను స్థానిక శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో 5 మసీదులు, హుస్సేన్ షా ఖాద్రీ దర్గా అభివృద్ధి, కాపు సంక్షేమ భవన్, రెల్లీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, భవానీపురం కరకట్ట రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేయడంపట్ల గౌస్‌మొహిద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ సభ్యులు షేక్ బడేమీయా, ఎండీ ఇక్బాల్, షేక్ యాసిన్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారంతో పాటు వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, శాసనమండలి సభ్యులు డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరు హనుమంతరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శంఖారావ సమైక్య స్ఫూర్తి దినోత్సవ వేడుకల్లో మల్లాది విష్ణు, డొక్కా మాణిక్యవరప్రసాద్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, జగన్మాత శ్రీఈశ్వరి దేవి మఠం పీఠాధిపతి వీర శివకుమార స్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. బీసీలు, విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరు హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 25 లక్షల మంది విశ్వబ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఇటీవల కాలంలో కుల దూషణ ఎక్కువగా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం, వసతి గృహాల నిర్మాణాలకు టీటీడీ ద్వారా ఎకరం స్థలం విశ్వబ్రాహ్మణ సంఘానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహాచారి, ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి టీ రంగబాబు, వివిధ జిల్లాల కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు, ఎమ్మెల్సీ మాణిక్యవరప్రసాద్‌లను నిర్వాహకులు సత్కరించారు.

రోబోటిక్స్‌దే భవిష్యత్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న కాలంలో రోబోటిక్స్‌దే భవిష్యత్ అని అద్వితీయ ల్యాబ్స్ డైరెక్టర్ ఏ పవన్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో అద్వితీయా ల్యాబ్స్(బెంగళూర్) సౌజన్యంతో కళాశాల ప్రాంగణంలో రోబోటిక్స్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రానున్న కాలంలో రోబోటిక్స్ కీలకమైన భూమిక పోషించనుందన్నారు. అన్ని రంగాల్లోనూ రోబోటిక్స్ పాత్ర ఉంటుందని, దానిద్వారానే ఆయా రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్స్ రంగంలో వస్తున్న మార్పులను గమనిస్తూ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా అద్వితీయా సంస్థతో కళాశాల ఎంవోయూ చేసుకుంది. కార్యక్రమంలో ఆ సంస్థ సీఈవో వై.అఖిల, కళాశాల కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జే.లక్ష్మీనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహాత్ముడి ఆశయ సాధనకు కృషి



మధురానగర్(విజయవాడసెంట్రల్): మహాత్మాగాంధీజీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి కోరారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, ఐటీసీ సహకారంతో పొడిచెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. వ్యర్థాల విభజన, రీసైక్లింగ్ పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం కళాశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో హేమ మహేశ్వరి, అధ్యాపకులు పి.శైలజ, బి.నాగమణి, టి.దేవేందర్‌రెడ్డి, వి.ఆశీర్వాదం, జి.గంగాధరరావు, జుబేదా, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతోనే ప్రగతి సాధ్యం



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏ రంగంలోనైనా నూతన ఆవిష్కరణలను తీసుకొచ్చినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందని కృష్ణా విశ్వవిద్యాలయం కంప్యూటర్స్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కృష్ణా విశ్వవిద్యాలయం భాగస్వామ్యంతో 'కంప్యూటర్స్ రంగంలో చోటు చేసుకున్న ప్రగతి' అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ముగింపు కార్యక్రమం శనివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు కంప్యూటర్స్ రంగంలో డిగ్రీలు పొందినంత మాత్రాన ఉపాధి అవకాశాలు దరిచేరవన్నారు. ఆయా రంగాల్లో పట్టు సాధించి తమలోని ప్రతిభకు పదును పెడితే అద్భుతమైన అవకాశాలు ఎదురవుతాయని వివరించారు. విద్యార్థులు మారుతున్న పరిస్థితులు, ఆవిష్కరణలపై అవగాహన పెంచుకొని అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాల్లో చోటు చేసుకున్న ప్రగతి, ఆవిష్కరణలపై పట్టు సాధించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీజీ డైరెక్టర్ ఎస్.వెంకటేష్, అధ్యాపకులు షమీమ్, పవన్‌కుమార్ రవీంద్ర పాల్గొన్నారు.

అండర్ వాటర్‌షిప్ టన్నెల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు తదితరులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నగర వాసులకు వినోదాన్ని, ఆహ్లాదాన్ని అందించడానికి సీ వరల్డ్ పేరుతో అండర్ వాటర్ షిప్ టన్నెల్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక విశాలాంధ్ర రోడ్డులోని శాతావాహనా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ షిప్ టన్నెల్‌ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. దసరా పండుగ సెలవుల్లో నగరవాసులు ఈ ఎగ్జిబిషన్ ద్వారా ఆహ్లాదాన్ని పొందవచ్చునన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఎస్.గురుగోపినాథ్, సైఫ్ ఖాన్ మాట్లాడుతూ నగరంలో 2 వేల రకాల చేపలతో ఈ షిప్ టన్నెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు జెయింట్ వీల్, కొలంబస్, టోరా టోరా, బ్రేక్‌డ్యాన్స్ ఈ ఎగ్జిబిషన్ ప్రత్యేకతమని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో లభించే వస్తువులు, గృహాలంకరణ సామాగ్రితో ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ తెరిచి ఉంటుందని, నగర వాసులు ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించాల్సిందిగా కోరారు. స్థానిక కార్పొరేటర్ కుక్కల అనిత, అడపా ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రేమ, సేవా గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి

దేశభక్తిని నింపిన జాతీయ బృందగాన పోటీలు



దేశభక్తి గీతాలను ఆలపిస్తున్న విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తోటి వారికి సేవ చేయడం, తనను ద్వేషించే వారిని కూడా ప్రేమించే గుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సెంట్రల్ జీఎస్టీ అండ్ కస్టమ్స్ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ బి.రాజేశ్వరరావు చెప్పారు. భారత్ వికాస్ పరిషత్ విజయవాడ, సెంట్రల్, ఈస్ట్ బ్రాంచ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నగర స్థాయిలో దేశభక్తి గీతాల జాతీయ బృందగాన పోటీలు శనివారం జరిగాయి. రాజేశ్వరరావు అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఈ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తోటి వారికి సహాయం చేసే గుణంతో పాటుగా ప్రేమించడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే వార్తా పత్రికలు, గ్రంథాలయంలోని పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. సెల్‌ఫోన్‌ను ఉపయోగించుకుంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఫోన్ చేసినంత మంచి ఎవ్వరూ చేయరని అన్నారు. ఫోన్ పట్టుకుని గేమ్స్ ఆడుకుండా, సోషల్ మీడియా చూస్తూ కూర్చుని సమయాన్ని వృథా చేసుకుంటే ఫోన్ అంత చెడ్డ వస్తువు మరేది లేదన్నారు. వివేకానంద జీవిత చరిత్రకు సంబంధించిన ప్రశ్నలను అడిగి విద్యార్థులతో ఆయన సమాధానాలను చెప్పించారు.

రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలు

భారత వికాస్ పరిషత్ నగర కమిటీ అధ్యక్షుడు ఎంవీఎస్ఎన్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికి 1967వ సంవత్సరం నుంచి తమ పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం నగర స్థాయిలో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రీజనల్, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. నగరంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. హిందీ, సంస్కృతం, రీజనల్, జానపదం విభాగాల్లో విద్యార్థులు గీతాలను ఆలపించారు. భారత వికాస్ పరిషత్ సభ్యులు సురేష్ సొలంకి, సీహెచ్.రమేష్‌బాబు, సంతోష్, ఏవీ.రమణ, పి.వసంత్ కుమార్, ఎస్.జగదీష్, కె.గాంధీ, ఎల్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న పద్మావతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):మాదక ద్రవ్యాల నిర్మూలన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి పేర్కొన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బావాజీపేటలోని యువభవన్ నందు మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగం అనే అంశంపై సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మావతి మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాల బారిన పడడం నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యల్లో ఒకటిగా పేర్కొన్నారు. సినిమాల ప్రభావం యువత మత్తుకు బానిసవుతున్నారన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం కారణంగా రోడ్డు ప్రమాదాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ యు.సుబ్బారావు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల అమ్మకం, కొనుగోలు, రవాణా, నిల్వ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వాటికి పాల్పడే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు.

పిల్లలకు విలువలు నేర్పించాలి..

నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ రత్నకుమార్ మాట్లాడుతూ మత్తు బానిసత్వం నుంచి యువతను విముక్తి చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ సువార్త మాట్లాడుతూ.. చిన్న వయసు నుంచే తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విలువలు నేర్పించాలన్నారు. రాష్ట్ర మహిళా సంరక్షణ జనరల్ సెక్రటరీ డి.మధులత మాట్లాడుతూ మత్తుకు బానిసైన వారిని రక్షించటానికి నవజీవన్ బాలభవన్‌తో కలిసి పని చేస్తామన్నారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ శేఖర్ బాబు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయటపడేసేందుకు డీ-ఎడిక్షన్ సెంటర్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐర్లాండ్ డాన్ బాస్కో ప్రతినిధి టోనీ బ్రుక్, నవజీవన్ బలభవన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అంతయ్య, అడ్మినిస్ట్రేటర్ తంబీ, సెబ్ సీఐ స్వరాజ్యలక్ష్మి, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్లు ఎస్కే నజ్మా, వసంత కుమారి, జాకబ్ రాజు, కె.ప్రియాంక, బి.రవి, బి.నెహేమియా, డి.రజిత, రాణి, హైమావతి పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అవగాహన సదస్సు

గుణదల(విజయవాడతూర్పు): అర్థశాస్త్రంలో విద్యార్థులు పట్టు సాధించడం ద్వారా దేశ ఆర్థిక స్థితిగతులను అవగతం చేసుకునే అవకాశం ఉంటుందని ఇక్ఫై ఫౌండేషన్ ఫర్ హైయర్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ టి.కోటి రెడ్డి అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అర్థశాస్త్రంపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. దేశ ఆర్థిక పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రపంచ దేశాల ఆర్థిక స్థితిగతులు, సంక్షోభ పరిస్థితులను విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్‌కుమార్, అధ్యాపకులు శామ్యూల్ దయాకర్, పూర్ణిమ పాల్గొన్నారు.